

సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 16 । మే । 2024



నేటి నుంచి చందనం విక్రయాలు

వరాహ లక్ష్మీనృసింహస్వామి నుంచి స్వీకరించిన చందనాన్ని నేటి నుంచి విక్రయిస్తున్నట్టు ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. 10లో



19న జూలో పోటీలు

విశాఖ జూ పార్కులో ఈనెల 19న విద్యార్థులకు జీవ వైవిధ్య పరిరక్షణపై పోటీలు నిర్వహించనున్నట్లు క్యూరేటర్ తెలిపారు. 10లో



ఘనంగా గౌరీశ్వరుల కల్యాణం

అనకాపల్లిలో వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయంలో కల్యాణంగా ఘనంగా జరిగింది. 10లో

న్యూస్‌రీల్

ఆర్ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చింతపల్లి రూరల్: స్థానిక ప్రభుత్వ ఆర్ ఐటీఐలో మొదటి విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ప్రిన్సిపాల్ రాజారావు తెలిపారు. కళాశాలలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్టస్‌మెన్ సివిల్, మోటార్ మెకానిక్, వెల్డర్, స్టెనోగ్రఫీ, ప్లంబర్, కార్పెంటర్ ట్రేడ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో జూన్ పదవ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. పనిదినాలలో ఒరిజనల్ ధ్రువపత్రాలు, ఆధార్, టెన్త్ మార్కుల జాబితాలతో చింతపల్లి ప్రభుత్వ ఆర్ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 9866108607,9494377833 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రక్షణగోడ పునర్నిర్మాణం



నిర్మాణ దశలో రక్షణగోడ

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు వెళ్లేమార్గంలో రైల్వేగేటు సమీపంలోని రక్షణగోడ నిర్మాణాన్ని రైల్వేశాఖ చేపట్టింది. ఈ ప్రాంతంలో రక్షణగోడ కూలిపోవడంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. సమస్యను గుర్తించిన రైల్వేశాఖ అధికారులు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టారు. ఈ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

22, 23 తేదీల్లో జీవ వైవిధ్య దినోత్సవం

- 21న వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

మహారాణిపేట: విశాఖపట్నంలో ఈ నెల 22, 23 తేదీల్లో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర జీవ వైవిధ్య మండలి కార్యదర్శి బి.వి.ఎ.కృష్ణమూర్తి తెలిపారు. 'ప్రణాళికలో భాగం అవ్వండి'అనే నినాదంతో ఏయూలోని జూబ్లీ ఆడిటోరియంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. జీవ వైవిధ్యానికి సంబంధించి ప్రముఖ వ్యక్తులు పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలో జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో ముఖ్యంగా యువత, విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్టాళ్ల ఏర్పాటు, బయో డైవర్సిటీ కన్జర్వేషన్ అవార్డులు అందిస్తామన్నారు. ఈ నెల 21న ఉదయం 9 గంటల నుంచి ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

తొలకరి పలకరింపు

- ఖరీఫ్ పనులు ప్రారంభం
- అనుకూలించిన వాతావరణం
- కురుస్తున్న వర్షాలు
- దుక్కి పనులు ప్రారంభం
- వ్యవసాయ పనుల్లో రైతుల బిజీ

సాక్షి,పాడేరు : జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గత కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వాతావరణం అనుకూలంగా మారింది. పాడేరు డివిజన్‌లో పరిస్థితి ఆశాజనకంగా ఉంది. ఖరీఫ్ సాగుకు సంబంధించి గతనెల మూడవ వారం నుంచి వేసవి దుక్కులు చేపట్టారు. మెట్ట ప్రాంత రైతులు వాణిజ్య, చిరుధాన్యాల సాగుకు గిరిజన రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. కొండపోడు భూముల్లో వేరశనగ విత్తనాలు జల్లుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మొలకెత్తే దశలో ఉన్నాయి.

విత్తనాలు సిద్ధం

రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు అవసరమైన వితనాలను సిద్ధం చేసింది. ఏటా 90 శాతం రాయితీపై అందజేస్తోంది. ఈ ఏడాది కూడా అదేవిధంగా సరఫరా చేసేందుకు 28 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉంచింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో విత్తనాల పంపిణీకి ఎన్నికల కమిషన్ ఆదేశాల కోసం వ్యవసాయశాఖ ఎదురుచూస్తోంది.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

పచ్చిరొట్టకు సంబంధించి జనుము, పిల్లి పెసర తదితర విత్తనాలను రాయితీపై పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది. కొంతమంది గిరిజన రైతులు తమ వద్ద ఉన్న సంప్రదాయ విత్తనాలను సాగుకు సిద్ధం చేసుకున్నారు. రాగులు, వేరుశనగ విత్తనాలను ఆర్‌బీకే కేంద్రాల ద్వారా గిరిజన రైతులకు పంపిణీ చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. రాగు పైరు మొక్క దశలో ఉంది.



హుకుంపేట మండలం డి.చింతలవీధిలో దుక్కి పనుల్లో నిమగ్నమైన రైతులు

ఆదేశాలు వచ్చిన వెంటనే పంపిణీ

ఖరీఫ్‌లో వ్యవసాయ రంగానికి మేలు చేసే కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. ఎన్నికల కమిషన్, ప్రభుత్వ ఆదేశాల మేరకు వరితో పాటు ఇతర పంటల విత్తనాల పంపిణీకి చర్యలు చేపడతాం. రైతులకు అవసరమైన వరి, ఇతర పంటల విత్తనాల పంపిణీకి ముందుగానే ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో దుక్కిపనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

– ఎస్‌బీఎస్.నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

అరకు అసెంబ్లీలో అత్యధిక పోలింగ్

- అందరికీ కృతజ్ఞతలు
- రిటర్నింగ్ అధికారి, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



అరకులోయ రూరల్: అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో అత్యధిక పోలింగ్ శాతం నమోదైందని పాడేరు ఐటీడీఏ పీవో, అరకు అసెంబ్లీ ఆర్వో అభిషేక్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆరు మండలాలకు సంబంధించి డుంబ్రిగుడ మండలంలో 48 పోలింగ్ కేంద్రాల పరిధిలో 38,536 మంది ఓటర్లలో 29,406 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. పోలింగ్ శాతం 76.31 శాతం నమోదైందని తెలిపారు. పెదబయలు మండలంలో 42,863 ఓటర్లకుగాను 27,729 మంది ఓటు వేయగా 64.69 పోలింగ్ శాతం నమోదైందన్నారు. మంచంగిపుట్టు మండలంలో 38486 మంది ఓటర్లలో 26,550 మంది ఓటవేయగా 68.69 పోలింగ్ శాతం నమోదైందన్నారు. హుకుంపేట మండలంలో 45,380 ఓటర్లకుగాను 32,971 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 72.66 పోలింగ్ శాతం నమోదైందని పేర్కొన్నారు. అరకులోయ మండలంలో 42,494 మంది ఓటర్లకుగాను 31,730 మంది ఓటు వేయగా 75.11మేర పోలింగ్ శాతం నమోదైందని పీవో తెలిపారు. ,అనంతగిరి మండలంలో 37,730 మంది ఓటర్లకుగాను 26,016 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని, 68.95 మేర పోలింగ్ శాతం నమోదైందని ఆయన పేర్కొన్నారు. అధిక శాతం పోలింగ్ నమోదుకు కృషి చేసిన అన్ని మండలా తహసీల్దార్లు, ఐటీడీఏ, రెవెన్యూ, పోలీసు, పోలింగ్ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

డోలీలో గర్భిణి తరలింపు

సకాలంలో ఆస్పత్రిలో చేర్పించడంతో తప్పిన ప్రాణాపాయం



కావ్యను డోలీలో తీసుకెళ్తున్న జాజులబంద గ్రామస్తులు

కొయ్యూరు: పురిటినొప్పులతో బాధపడతున్న గర్భిణిని డోలీలో ఆరు కిలోమీటర్ల మోసుకుని తీసుకువచ్చి ఆస్పత్రికి తరలించారు. దీంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది. మండలంలోని మూలపేట పంచాయతీ జాజులబందకు చెందిన గర్భిణి మర్రి కావ్యకు బుధవారం తెల్లవారు నుంచి పురిటి నొప్పులు మొదలయ్యాయి. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆమెను ఆరు కిలోమీటర్ల దూరం మేర రోలుగుంట మండలం అర్ల వరకు మోసుకుని వచ్చారు. అక్కడ నుంచి అతి కష్టంమీద బుచ్చింపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. ఈ సందర్భంగా కావ్య బంధువు కామేష్ మాట్లాడుతూ రూ.70 లక్షలతో రహదారి మంజూరైనప్పటికీ పనులు పూర్తికానందున డోలీమోతలు తప్పడం లేదన్నారు. డొనూరు వైద్యులు కూడా కనీసం స్పందించలేదని వాపోయారు. దీనిపై జేఈ రామకృష్ణ మాట్లాడుతూ రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఎన్నికలు కావడంతో కొందరు కార్మికులు ఓట్లు వేసేందుకు వారి సొంతూళ్లకు వెళ్లారన్నారు. వారు తిరిగి రాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పనులు చురుగ్గానే జరుగుతున్నాయని ఆయన వివరించారు.

పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో తప్పనిసరిగా విజయం

పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు



జి.మాడుగులలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: అరకు పార్లమెంట్, పాడేరు అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగినందున అన్ని వర్గాల ప్రజలు తమ పార్టీకి మద్దతు ఇచ్చినట్టుగా భావిస్తున్నామని పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలానికి చెందిన సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాట్లాడారు. ప్రజల సహకారం, పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాట్ల వల్ల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. ప్రజారంజకపాలన అందించిన తమ ప్రభుత్వానికి మద్దతుగా ఈఎన్నికల్లో వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులు, అన్నివర్గాల ప్రజలు నిలిచారన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులంతా అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తామని ఆయన పేర్కొన్నారు. సీఎం జగనన్న రాష్ట్రాపురోగాభివృద్ధికి చేపట్టిన పథకాలు తమ విజయానికి సోపానాలు అవుతాయన్నారు. గత ఎన్నికల్లో పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీకి 43 వేల మెజారిటీ వచ్చిందన్నారు. తనకు మరో పదివేలు అదనంగా మెజారిటీ వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె సత్యనారాయణ, సర్పంచ్‌లు కిముడు రాంబాబు గంగరాజు, ఎంపీటీసీ చిట్టిబాబు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నబాబుఆచారి, పండన్న,మరా మన్మథరావు, ప్రసాద్, ఉత్తర వేణు బాబు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరంలో ఐసీయూ సేవలు ప్రారంభం

- ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి



ఐసీయూ సేవలను ప్రారంభించిన డాక్టర్ లక్ష్మి

రంపచోడవరం: రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ఐసీయూ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.లక్ష్మి తెలిపారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఐసీయూ సేవలను బుధవారం ప్రారంభించిన ఆమె మాట్లాడారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత ఆస్పత్రికి వచ్చిన ప్రతీ రోగికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. శస్త్రచికిత్స జరిగిన తరువాత, కొన్ని కేసులను ఐసీయూలో ఉంచి పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. అందుకోసం ఐసీయూను అందుబాటులోకి తెచ్చమన్నారు. ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య నిపుణులు అందరూ అందుబాటులో ఉన్నారని ఆస్పత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ వైద్యులు సుధాకర్ పాల్గొన్నారు.

పొల్లూరులో పుష్ప-2 షూటింగ్ సందడి



షూటింగ్‌ను చూసేందుకు వచ్చిన జనం



షూటింగ్ కోసం ఏర్పాటు చేసిన సెట్

మోతుగూడెం: పొల్లూరు పరిసర ప్రాంతాల్లో పుష్ప-2 సినిమా షూటింగ్ చిత్రీకరణ సందడి నెలకొంది. దీనిలో భాగంగా బుధవారం పొల్లూరులో దుర్గా మల్లేశ్వరి ఆలయం వద్ద ఎస్టీడీ బూత్, మార్కెట్, పరిసరాల్లో గుడిసెలు ఏర్పాటుచేశారు. వీటి వద్ద కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. స్థానికంగా సుమారు 300 మంది యువకులకు కొన్ని సన్నివేశాల్లో అవకాశం కల్పించారు. గురువారం పొల్లూరు పిక్నిక్ స్పాట్ వద్ద చిత్రీకరణకు ఏర్పాట్లు చేశారు. నటీ నటులను చూసేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

భువనేశ్వర్-యల్లహంక సమ్మర్ స్పెషల్

తాటిచెట్లపాలెం: వేసవి సీజన్ ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉన్నందున భువనేశ్వర్-యల్లహంక-భువనేశ్వర్ మధ్య (వయా దువ్వాడ మీదుగా) సమ్మర్ స్పెషల్స్ నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. భువనేశ్వర్-యల్లహంక(02811) సమ్మర్ స్పెషల్ ప్రతీ శనివారాలలో భువనేశ్వర్‌లో రాత్రి 7.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 1.53 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.55 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 11.55 గంటలకు యల్లహంక చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జూన్ 1వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో యల్లహంక-భువనేశ్వర్(02812) సమ్మర్ స్పెషల్ ప్రతీ సోమవారాలలో యల్లహంకలో ఉదయం 5 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 4.32 గంటలకు బయల్దేరి అదేరోజు మధ్యాహ్నం 12.15గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జూన్ 3వ తేదీ నుంచి జూలై 1వ తేదీ వరకు నడుస్తాయి. ఈ స్పెషల్ రైళ్లు 16-థర్డ్ ఏసీ, 2-జనరేటర్ మోటార్ కార్ కోచ్‌లతో నడుస్తాయి.

ఏయూ ఈఈటీ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభం

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కోర్సుల్లో సెల్ఫ్‌సపోర్ట్ విధానంలో ప్రవేశాలకు నిర్వహించిన ఏయూ ఈఈటీ 2024 ప్రవేశాల కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమైంది. ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. రక్షణ రంగ ఉద్యోగులు, దివ్యాంగుల విభాగాల వారికి ఈ నెల 17న ప్రత్యక్షంగా సర్టిఫికెట్ల పరిశీలన జరుపుతారు. ఎన్‌సీసీ, క్రీడా విభాగాల వారు తమ సర్టిఫికెట్లను ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు అప్‌లోడ్ చేయాలని, ఇతర విభాగాల విద్యార్థులు ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు తమ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలని ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు సూచించారు. ఈనెల 25 నుంచి 29 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. తొలిదశ సీట్ల కేటాయింపు జూన్ 1వ తేదీన నిర్వహిస్తారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు జూన్ 3 నుంచి 10వ తేదీ వరకు నిర్ణీత ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

లాభాల సిరి.. జీడి మామిడి

- ఆశాజనకంగా దిగుబడి
- 80 కిలోల బస్తా రూ. 9 వేలు
- రేటు బాగుండటంతో రైతుల్లో ఆనందం

ఎండనక.. వాననక చెమటోడ్చి శ్రమించే అన్నదాత తన సాగు ఫలప్రదమై.. ఏ కాస్త లాభం కళ్ల జూసినా కొండంత సంబరపడిపోతాడు. అయితే ప్రతిసారీ అలా జరగదు. ప్రతికూల వాతావరణం.. అకాల వర్షాలు.. తదితర సమస్యల వల్ల రైతన్న నష్టపోతూనే ఉంటాడు. అయితే ఈ ఏడాది అదృష్టం బాగుండి.. సకాలంలో వర్షాలు పడకపోయినా.. జీడిమామిడి రైతులు సంతోషంగానే ఉన్నారు. దీనికి కారణం.. వాతావరణం అనుకూలించకపోయినా దిగుబడి ఆశించిన మేర లేకపోయినా రేటు బాగుండటంతో కర్షక మారాజులు సంబరపడుతున్నారు.

నాతవరం: ఈ ఏడాది జీడి పిక్కల రేటు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది పంట దిగుబడి రైతులు ఆశించిన విధంగా లేకపోయినప్పటికీ రేటు మాత్రం బాగుంది. ప్రస్తుతం మార్కెట్లో జీడి పిక్కలు 80 కేజీల బస్తా నాణ్యతను బట్టి రూ. 8,700 నుంచి రూ. 9 వేల వరకు పలుకుతోంది. జిల్లాలో వరి పంట తర్వాత రైతులు అధికంగా సాగు చేసేది జీడిమామిడినే. జిల్లాలో 24 మండలాల్లోని 58 వేల ఎకరాల్లో జీడి మామిడి సాగు చేస్తున్నారు. నాతవరం, రోలుగుంట, నక్కపల్లి, కోటవురట్ల, గొలుగొండ, రావికమతం, బుచ్చెయ్యపేట, మాడుగుల, ఎస్.రాయవరం మండలాల్లో అధికంగా జీడి మామిడి పంట సాగులో ఉంది. మిగతా మండలాల్లో ఓ మోస్తరుగా ఈ పంట సాగు చేస్తున్నారు. నాతవరం మండలంలో జిల్లాలోనే అధిక విస్తీర్ణంలో జీడి తోటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండటంతో జీడీ పూత నెల ఆలస్యమై పెట్టుబడికి తగ్గట్టు దిగుబడులు రాలేదని రైతులంటున్నారు. మార్చి నుంచి మే నెలాఖరు వరకు.. అంటే సుమారు మూడు నెలలు జీడిమామిడి సాగుకు అనువైన కాలం. ఇతర పంటలతో పోల్చుకుంటే జీడి మామిడి తక్కువ పెట్టుబడితో అధికాదాయం అందజేస్తుంది. ఎకరా విస్తీర్ణంలో పెద్ద జీడి మామిడి చెట్ల వల్ల నాలుగు నుంచి ఐదు బస్తాల దిగుబడి వస్తుంది. తోట సంరక్షణ, దుక్కి ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీల ఖర్చు అన్నీ కలిపి ఎకరాకి రూ. 8 నుంచి 10 వేలు ఖర్చవుతుంది. ప్రభుత్వం కూడా ఉద్యానవనశాఖ ద్వారా జీడి రైతులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తోంది. సీజనల్‌గా జీడి తోటలకు వచ్చే తెగుళ్ల నివారించేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు సూచనలందిస్తోంది. దీంతో పాటు వైఎస్సార్ రైతు భరోసా పథకంలో పెట్టుబడి కింద ఆర్థిక సాయం చేస్తోంది. జాబ్ కార్డు ఉన్న రైతులు ఉపాధి హామీ పథకంలో జీడితోటల్లోని గట్లు పటిష్టం చేయటం, తుప్పలు తొలగించడం వంటి పనులు ఉచితంగా చేయడంతో రైతులకు పెట్టుబడి బాధలు తగ్గాయి.



ఎండలో ఆరబోసిన జీడి పిక్కలు (ఇన్‌సెట్) కాపు దశలో జీడిమామిడి తోట

గ్రామంలోనే కొనుగోలు..

రైతులు పండించిన జీడి పిక్కలను ప్రైవేట్ వ్యక్తులు రైతుల వద్దకే వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. గతంలో కొందరే జీడి పిక్కలు కొనుగోలు చేయడంతో రైతులు ఇబ్బంది పడేవారు.

ఇప్పుడు ఆ బాధ లేదు. ఈ ఏడాది జీడి రైతులకు ఇతర పంటల కంటే జీడి పంట ఆదాయం బాగుంది.

దుశ్శాసన పర్వం

- నర్సీపట్నంలో పచ్చ మూకల అమానుషం
- పూర్వ మహిళా వలంటీర్‌పై పాశవికంగా దాడి
- జుత్తుపట్టుకొని లాక్కొచ్చి, దుస్తులు చించేసిన అయ్యన్న అనుచరులు
- ఎన్నికల్లో చురుగ్గా పనిచేశారన్న కోపంతో దుశ్చర్య
- నిందితులు రెడ్డిసాయి, రెడ్డి రాజేష్, గంగాధర్‌లపై పోలీసులకు ఫిర్యాదు
- ఏరియా ఆస్పత్రిలో బాధితురాలికి వైద్యం

రాత్రి వేళ జుత్తు పట్టుకొని లాక్కొచ్చారు.. కాళ్లతో తన్నుకుంటూ.. తాకరాని చోట తాకుతూ.. దుస్తులు చింపేశారు. అడ్డు వచ్చిన వారిని గాయపరిచారు. ఫోన్లు, ఒంటిపైనున్న బంగారు వస్తువులు లాక్కెళ్లారు. నర్సీపట్నంలో ఒంటరి మహిళపై మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అనుచరులు జరిపిన దాష్టీకమిది. వలంటీర్‌గా సేవలందించడమే ఆమె చేసిన పాపమట.. వలంటీర్ వ్యవస్థను ఎన్నికల ప్రక్రియకు దూరం చేయడంతో రాజీనామా చేసి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పనిచేయడమే ఆమె చేసిన పాపమట.. అందుకే దుశ్శాసనుల్లా ఆమెను ఈడ్చుకొచ్చారు. వివస్త్రను చేశారు. ఈ ఘటనతో సభ్యసమాజం సిగ్గుతో తలదించుకుంది. గాంధీ గారి దేశంలో గజానికో గాంధారి కొడుకు తయారయ్యాడని.. వారికి అడ్డుకట్ట వేసేందుకు దశ 'దిశ' నిర్దేశించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నా.. ఆయన ఆశయాల కోసం పనిచేస్తున్నవారన్నా ఎందుకంత కక్ష, కార్పణ్యం అని ప్రశ్నిస్తోంది.

– విశాఖ సిటీ

వలంటీర్లంటే వారికి ఒళ్లు మంట. సేవలతో ప్రజలకు దగ్గరవుతున్నారని, సీఎం జగన్ ప్రతినిధులుగా ప్రజలు వారిని ప్రేమిస్తున్నారని ద్వేషం. వారి వల్ల రాజకీయంగా తాము బలహీనపడుతున్నామని కడుపు మంట. అందులో మహిళా వలంటీరంటే మరింత చులకన. అందుకే నర్సీపట్నం మండలం ధర్మసాగరంలో పూర్వ వలంటీర్ పాలమూరి రాజకుమారిపై మంగళవారం రాత్రి అయ్యన్నపాత్రుడి అనుచరులు కీచకపర్వానికి తెగబడ్డారు. రాజకుమారికి భర్త లేడు. 13 ఏళ్ల కుమారుడితో ఆమె ఒంటరిగా జీవిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత వలంటీర్‌గా చేరారు. సీఎం వైఎస్ జగన్ ఆశయాలకు అనుగుణంగా మనసారా సేవలందించారు. చంద్రబాబు అండ్ కో ఫిర్యాదులతో వలంటీర్లను ఎన్నికల ప్రక్రియకు దూరం పెట్టమన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలతో మనస్తాపం చెంది ఆమె రాజీనామా చేశారు. ఎన్నికల్లో చురుకైన పాత్ర పోషించారు. పోలింగ్ రోజున ఓటర్లకు స్లిప్‌లు రాసిచ్చి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పని చేయడం టీడీపీ అభ్యర్థి అయ్యన్న పాత్రుడి అనుచరులకు మింగుడు పడలేదు. అదే గ్రామానికి చెందిన టీడీపీ జెడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ అనుచరులు రెడ్డి రాజేష్, రెడ్డి సత్యనారాయణ, కామిరెడ్డి శివ, సుకల రాజేష్‌తో పాటు మరికొందరు రాజకుమారిని టార్గెట్ చేశారు.



తప్పిన ప్రాణాపాయం

పోలింగ్ మరుసటి రోజు మంగళవారం రాత్రి రాజకుమారి పడుకునేందుకు తన 13 ఏళ్ల కుమారుడిని వెంట పెట్టుకొని అదే గ్రామంలో ఉన్న అమ్మ వాళ్ల ఇంటికి వెళ్లారు. రాత్రి 10 గంటల సమయంలో టీడీపీ మూకలు రెడ్డి రాజేష్, రెడ్డి సత్యసాయి, కామిరెడ్డి శివ, సుకల రాజేష్, పెట్ల గంగాధర్, అల్లు రాజు, వానపల్లి రాజేష్, సార్ల రఘు, నందిపల్లి బోయిల నాయుడు వారి ఇంటి మీదకు ఎగబడ్డారు. రాజకుమారిపై దాడి చేశారు. వారి చర్యలను ఆమె సెల్‌ఫోన్‌లో చిత్రీకరించేందుకు ప్రయత్నించడంతో ఆమె చేతిలో ఉన్న మొబైల్‌ను లొక్కొని జుట్టు పట్టుకొని బయటకు లాక్కొచ్చారు. ఛాతి మీద చేయి వేసి విచక్షణారహితంగా కొట్టి గాయపరిచారు. ఆమె ఒంటి మీద బట్టలను చించేసి వివస్త్రను చేశారు. మెడలోని బంగారు గొలుసు లాక్కున్నారు. రాజకుమారిపై దాడిని అడ్డుకోవడానికి స్థానిక యువకులు, మహిళలు ప్రయత్నించారు. టీడీపీ నేతలు వారిపై కూడా దాడి చేసి గాయపరిచారు. దీంతో ఒమ్మి గోవింద, గజ్జల గోపీచంద్, వియ్యపు వరహాలు, గుమ్మిడి సీతమ్మలకు కూడా గాయాలయ్యాయి. రాజకుమారిని రక్షించడానికి ప్రయత్నించిన వృద్ధురాలు సీతమ్మ చెంపపై గట్టిగా కొట్టి ఆమె బంగారు చెవి దుద్దులు లాక్కొని వెళ్లిపోయారు. ఒంటరిగా ఉంటే చంపేసే వారని, అమ్మ వాళ్ల ఇంటి వద్ద ఉండడంతో ప్రాణాలతో బయటపడ్డానని రాజకుమారి చెప్పారు. ఈ ఘటనపై ఆమె నర్సీపట్నం రూరల్ పోసులకు ఫిర్యాదు చేసి, తనకు రక్షణ కల్పించాలని కోరారు. పోలీసులు దాడికి పాల్పడిన వారిపై 324, 506, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

నేటి నుంచి చందనం విక్రయాలు

సింహాచలం: చందనోత్సవం రోజు వరాహ లక్ష్మీనృసింహస్వామి నుంచి స్వీకరించిన చందనాన్ని ఈ నెల 16, 17, 19, 20, 21 తేదీల్లో విక్రయిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సుమారు 10 గ్రాముల చందనం ప్యాకెట్‌ను రూ.10కి విక్రయిస్తామన్నారు. సింహగిరిపై ప్రసాదాల విక్రయశాల వద్ద ఉదయం ప్యాకెట్ల విక్రయం ఉంటుందని, భక్తులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా గౌరీశ్వరుల కల్యాణం

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. తెల్లవారు జాము నుంచి గౌరీపరమేశ్వరులకు ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు మధ్యాహ్నం 10 వేల మందికి అన్న సమారాధన జరిపారు. రాత్రి 7 గంటలకు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి గోప అప్పలాచార్యులు(చక్రవర్తి) ఆధ్వర్యంలో దంపతులతో గౌరీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించి, స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవ కమిటీ, ఆలయ నిర్వహణ కమిటీ, అన్నసమారాధన కమిటీ, వేల్పుల వీధి పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో నడుస్తున్న పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున, ఆయా స్టేషన్ల నుంచి బయల్దేరాల్సిన రైళ్లు రీ షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. విశాఖపట్నం–నాందేడ్ (20811) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–లోకమాన్యతిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్, బ్రహ్మపూర్ – సికింద్రాబాద్ (07036) సమ్మర్ స్పెషల్, సంత్రగచ్చి – చెన్నై ఎగ్మోర్ (06080) స్పెషల్ ఆలస్యంగా బయలుదేరాయి.

మామిడీలా..!

వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో మామిడి దిగుబడి ఈ ఏడాది గణనీయంగా తగ్గిపోయింది. ఆశించిన ధర ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. మరో వైపు మామిడి రాకపోవడంతో కమీషన్ దుకాణాలు వెలవెలబోతున్నాయి. ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ నెలాఖరు వరకు మామిడి సీజన్ ఉంటుంది. డిసెంబరు నాటికి పూత రావాల్సి ఉన్నప్పటికీ ఈ ఏడాది ఫిబ్రవరి వరకు కూడా రాలేదు. దీంతో మామిడి పంట దిగుబడి తగ్గింది. రైతులతో పాటు, లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టే కమీషన్ వ్యాపారులు కూడా నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

- ఈ ఏడాది గణనీయంగా **తగ్గిన దిగుబడి**
- ధర ఉన్నా.. ఫలితం **శూన్యం**
- వెలవెలబోతున్న కమీష**న్ దుకాణాలు**



ఎగుమతికి సిద్ధం చేసిన మామిడి పండ్లు

నక్కపల్లి :

గ్రామీణ జిల్లాలో సుమారు **35 వేల ఎకరాల్లో** మామిడి సాగవుతోంది. **వాతావరణం అనుకూలిస్తే** ఎకరాకు 6 టన్నుల **దిగుబడి వస్తుంది. ఈ** లెక్కన ఏటా సుమారు 2 ల**క్షల టన్నుల దిగుబడి** రావాలి. ఉద్యానవన శాఖాధికారులు మాత్రం 75 నుంచి 80 శాతం దిగుబడినే పరిగణనలోకి తీసుకుంటారు. జిల్లాలో మామిడి సాగులో పాయకరావుపేట నియోజకవర్గానిదే అగ్రస్థానం. నక్కపల్లి మండలంలో 10 వేల ఎకరాలు, కోటవురట్ల మండలంలో 7 వేల ఎకరాలు, పాయకరావుపేట మండలంలో 4 వేల ఎకరాలు, ఎస్.రాయవరం మండలంలో 6 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. తర్వాత పద్మనాభం మండలంలో ఎక్కువగా సాగు చేస్తున్నారు. నాతవరం, కొయ్యూరు, నర్సీపట్నం, గొలుగొండ, యలమంచిలి, రాంబిల్లి, మాడుగుల, కోటపాడు, చోడవరం మండలాల్లో దాదాపు 5 వేల ఎకరాల్లో మామిడి పండిస్తున్నారు. ప్రతి ఏటా జిల్లా నుంచి లక్ష టన్నుల పైనే ఎగుమతి జరిగేది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో **సగానికి సగం దిగుబడి పడిపోయిందని వ్యాపారులు, రైతులు చెబుతున్నారు. సీజన్ పూర్తయ్యే నాటికి 50 వేల టన్నుల ఎగుమతి చేయడం కష్టమేనని అంటున్నారు.**

హైవే పక్కనే కమీషన్ దుకాణాలు

జిల్లాలోనే మామిడి సాగులో అగ్రస్థానంలో ఉన్న పాయకరావుపేట నియోజకవర్గంలో వేంపాడు, చినదొడ్డిగల్లు, కాగిత జాతీయ రహదారి పక్కన కమీషన్ దుకాణాలు ఎక్కువగా ఏర్పాటు చేస్తుంటారు. ఇక్కడ 14 వరకు దుకాణాలు ఏర్పాటు చేసి ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, ఒడిశా, హైదరాబాద్, బెంగళూరు, కటక్, విశాఖపట్నం, విజయవాడ, చెన్నై తదితర ప్రాంతాలకు మామిడి కాయలు, పండ్లను కూడా ఎగుమతి చేస్తుంటారు. డిసెంబరు నుంచే ఇక్కడ కమీషన్ వ్యాపారులు తమ దుకాణాలు తెరిచి చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉన్న మామిడి తోటలను కొనుగోలు చేయడం.. రైతులకు పెట్టుబడుల కోసం అడ్వాన్సులు చెల్లిస్తుంటారు. వేంపాడు, చినదొడ్డిగల్లు కాగిత ప్రాంతాల **నుంచి ఏటా సీజన్ ముగిసే నాటికి సుమారు 20 నుంచి 30 వేల టన్నులకు పైగా మామిడి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. గతంలో రోజుకు 500 నుంచి 800 టన్నులు ఎగుమతి అయ్యేది. ఈ** ఏడాది మాత్రం రోజుకు 100 నుంచి 200 టన్నులకు మించి ఎగుమతి చేయడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఒక్కొక్క దుకాణం నుంచి గతంలో 10 టన్నుల వ్యాన్లు రోజుకు పది వరకు పంపించే వారమని, ఇప్పుడు 3 టన్నుల సామర్థ్యం కలిగిన బొలేరో వాహనాలను రోజుకు పది మాత్రమే పంపించగలుగుతున్నామని వారు చెబుతున్నారు.

ధర సూపర్

ఈ ఏడాది మామిడి ధర చాలా బాగుంది. బంగిన పల్లి ధర టన్ను రూ.40 వేలు ఉంది. సువర్ణరేఖ రూ.50 వేల నుంచి 60 వేల వరకు ఉంది. కలెక్టర్ రకం రూ.23 వేల వరకు ఉంది. ఇక రసాలు, కోలంగోవా వంటి పండ్ల రకాల ధరలు రూ.35 వేలు పైబడే ఉంది.

పెట్టుబడులు రావడం కష్టమే..

పదెకరాల మామిడి తోటను ఏడాది ఫలసాయం **కోసం రూ.1.50 లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తారు. పురుగు మందులు పి**చికారీ, ఎరువులు **తదితర వాటి కోసం మరో** రూ.50 వేల వరకు **ఖర్చు చేస్తారు. తీరా ఇంత** పెట్టుబడి పెట్టినా దిగుబడి మాత్రం అంతంత మాత్రంగానే ఉందని రైతులు వాపోతున్నారు. వర్షాలు పడకపోవడం, పొగ మంచు, బొడ్డుపుచ్చు పురుగు కారణంగా దిగుబడి రాలేదని చెబుతున్నారు. వచ్చిన కాయలు కూడా నాణ్యతతో ఉండడం లేదని అంటున్నారు.



చినదొడ్డిగల్లు వద్ద ఏర్పాటు చేసిన కమీషన్ దుకాణం



చినదొడ్డిగల్లు కమీషన్ దుకాణం వద్ద అరకొరగా వచ్చిన మామిడికాయలు

లీజు డబ్బులూ వచ్చేటట్టు లేదు..

లక్షల పెట్టుబడి పెట్టి మామిడి తోటలు లీజుకు తీసుకొన్నాం. వాతావరణం అనుకూలించకపోవడం వల్ల దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. లీజు డబ్బులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మామిడితో పాటు, జీడి పరిస్థితి కూడా అలాగే ఉంది. ఈ ఏడాది పెట్టుడి కూడా వచ్చే పరిస్థితి లేదు. కమీషన్ దుకాణాలకు కాకుండా టోకు పద్ధతిలో రైతుబజార్లకు వెళ్లి విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– ఎస్.వి.రమణ, రైతు

ప్రతికూల పరిస్థితులతో నష్టాలు

ఏటా లక్షలాది రూపాయలు పెట్టి మామిడి తోటలు కొనుగోలు చేస్తున్నాం. కమీషన్ దుకాణాలు ఏర్పాటు చేశాం. ప్రతికూల పరిస్థితుల వల్ల దిగుబడి రాక నష్టాలు చవిచూస్తున్నాం. దుకాణాలు ఏర్పాటు చేసి రెండు నెలలు గడుస్తున్నా వెయ్యి టన్నులు ఎగుమతి చేయలేని పరిస్థితి నెలకొంది.

– తోట సత్తిబాబు, మామిడి వ్యాపారి

గిరిజనుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం



వైద్యులతో మాట్లాడుతున్న పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్

పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

గూడెం కొత్తవీధి: గిరిజనుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సేతు కార్యక్రమంలో భాగంగా చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆధ్వర్యంలో మెగా కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్స కేంద్రం నిర్వహించారు. జిల్లా ఆస్పత్రి పర్యవేక్షణాధికారి కృష్ణారావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో భాగంగా 120 మందికి కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్సలు వైద్యులు చేపట్టారు. వైద్యాధికారులు హిమబిందు, లక్ష్మీకాంత్, అచ్యుత్‌రావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏఎస్పీ శివ కిషోర్ గ్రామస్తులతో మాట్లాడారు. పలు సూచనలిచ్చారు. గిరిజనులకు భోజన సదుపాయం కల్పించారు. సీఐలు అప్పలనాయుడు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

19న జూలో పోటీలు

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో ఈనెల 19న ఒకటో తరగతి నుంచి పీజీ విద్యార్థులకు జీవ వైవిధ్య పరిరక్షణపై పోటీలతోపాటు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ నందని సలారియా ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు జాతీయ స్థాయి వేడుకలను నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు జీవ వైవిధ్యంపై అవగాహనతో పాటు పోటీలు నిర్వహించనున్నామన్నారు. జూ బయోస్కోప్‌లో 19న ఉదయం 10 గంటల నుంచి ఈ పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు 78936 32900 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఆ రోజు విద్యార్థులకు జూలో ఉచిత ప్రవేశం ఉంటున్నారు. ఉదయం 10 నుంచి 11 గంటలు వరకు వ్యాసరచన, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు చిత్రలేఖనం, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటలు వరకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 1 నుంచి 5వ తరగతి వరకు, 6 నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు బ్యాచ్‌లుగా విడదీస్తున్నట్లు పేర్కొన్నారు.

వాతావరణ పరిస్థితులను సద్వినియోగం చేసుకోవాలి



కొరడా తెగులు



చెరకులో పీక పురుగు

అనకాపల్లి : రాగల వర్షాలను రైతులు వినియోగించుకుని చెరకు పంటకు నేల తయారు చేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు చెరకులో పీక పురుగు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మీ.లీ. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మీ.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే 90 రోజుల వయసు గల పంటకు ఎకరాకు 75 కిలోల యూరియా, 45 రోజల వయసు గల కార్శి చేసిన పైరుకు ఎకరాకు 150 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలన్నారు. చెరకులో విశ్వమిత్ర వంటి రకాలలో కొరడా తెగులు ఎక్కువగా ఆశించే అవకాశం ఉందని, తెగులు గమనించినట్లయితే ప్రాపికొనజోల్ 1 మి.లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. ఖరీఫ్‌కు ముందుగా పచ్చి రొట్ట వేసుకోవాలనుకునే రైతులు జనుము (12–15 కిలోలు, ఎకరాకి), జీలుగు (10–12 కిలోలు ఎకరాకి), పిల్లిపెసర(10–12 కిలోలు ఎకరాకి), పెసర (8–10 కిలోలు ఎకరాకి) పచ్చిరొట్ట పైరు వేసుకోవచ్చన్నారు. మట్టి నమూనాలను సేకరించి విశ్లేషణకు అనుగుణంగా ఎరువులు వేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. తొలకరి వర్షాలను ఉపయోగించుకుని దుక్కులు దున్నుకుంటే తేమ సంరక్షించబడి పంటలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భూమి లోపల పొరల్లో కోసస్త దశల్లో ఉండే పురుగులకు సూర్యరశ్మి తాకడం వలన మేలు జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పీఎంపాలెం: చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రధాన గేటుకు ఎదురుగా జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీనియర్ నాయకుడు గుమ్మడి మధుసూదనరావు(55) దుర్మరణం చెందాడు. సాయంత్రం 4 గంటల సమయంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 5వ వార్డులోని సాయిరామ్‌కాలనీలో నివసిస్తున్న గుమ్మడి మధుసూదనరావు సీనియర్ రాజకీయ నాయకుడిగా ఈ ప్రాంత వాసులకు చిరపరిచితుడు. ఆయనకు భార్యతో పాటు పెళ్లయిన కుమారుడు, కుమార్తె ఉన్నారు. మొదట్లో కాంగ్రెస్‌లో కొనసాగిన మధు ఆ తర్వాత వైఎస్సార్ సీపీ, టీడీపీలో కొనసాగారు. వ్యక్తిగత కారణాలతో కొంత కాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు. హీరో వెంకటేశ్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడిగా కూడా ఆయన పనిచేశారు. జాతీయ రహదారిపై నగరం నుంచి ఆనందపురం వైపు ద్విచక్రవాహనంపై ఆయన ప్రయాణిస్తుండగా.. వెనుకనే వస్తున్న లారీ నుంచి వస్తున్న లారీ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అతని కుమారుడు మనోజ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వై.రామకృష్ణ తెలిపారు. గుమ్మడి మధు ఆకస్మిక మృతితో సాయిరామ్ కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. స్థానిక దుర్గాలమ్మ ఆలయ నిర్మాణకర్తగా గుర్తింపు పొందిన గుమ్మడి మధు మృతి పట్ల ఈ ప్రాంతవాసులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



ప్రమాద స్థలంలో మృతుడు



మధు(ఫైల్)

ఉరి పోసుకుని యువకుడి ఆత్మహత్య

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో యువకుడు ఉరి వేసుకొని బుధవారం ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెచ్‌సీ అప్పలకొండ అందించిన వివరాల ప్రకారం.. బంగారయ్యపేటలోని బీసీ కాలనీకి చెందిన మదిని గోవింద (28) పెంకుటింట్లో దూలానికి చీరతో ఉరి పోసుకొని ఆత్మహత్యకు ఒడిగట్టాడు. మృతుడు ఈనెల 13 ఉదయం 8 గంటలకు ఓటు వేయడానికి ఇంటి నుంచి బయటికి వెళ్లి కనిపించకపోవడంతో తల్లి రాము బుధవారం వెళ్లి చూడగా ఉరి వేసుకుని ఉన్నాడు. అతను అదే పనిగా మద్యం మత్తులో ఉంటాడని స్థానికులు హెచ్‌సీకి తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ అప్పలకొండ తెలిపారు.



గోవింద (ఫైల్)

సోషల్ మీడియా గప్‌చుప్

- సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొన్నాళ్లుగా ఉధృత ప్రచారం
- సినిమాలు, ఐపీఎల్‌ను తలదన్నేలా రీల్స్, వీడియోలు
- ఎన్నికలు ముగియడంతో నిశ్శబ్దమైన ఆన్‌లైన్ యాప్స్



సాక్షి, విశాఖపట్నం: సాధారణంగా ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించడం కోసం వీధుల్లోని గోడలపై పోస్టర్లు అతికించే ఆనవాయితీ నుంచి డిజిటల్ వేదికల్లో వినూత్న పంథాలో ప్రచారం చేసేంత వరకు రూపాంతరం చెందింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొన్ని నెలలుగా జిల్లా అంతటా జోరుగా ప్రచారం సాగింది. సోమవారం ఎన్నికలు ముగియడంతో ఒక్కసారిగా సోషల్ మీడియా మూగబోయింది. వాట్సాప్ మెసేజ్‌లు, అభ్యర్థుల బ్రాడ్‌కాస్టింగ్ కాల్స్, ఇన్‌స్టా రీల్స్, ఎక్స్ పోస్టర్లతో దద్దరిల్లిన సోషల్ ప్రచారం గప్‌చుప్ అయిపోయింది. ఈసారి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియా ప్రచారం కీలక పాత్ర పోషించింది. ఒకానొక క్రమంలో సినిమాలు, ప్రస్తుతం కొనసాగుతున్న ఐపీఎల్ క్రికెట్ మానియాను సైతం తలదన్నేలా డిజిటల్ ప్రచారం కొనసాగింది. ఒక్క పోస్ట్, ఒకే ఒక్క రీల్‌తో వేల మందిని ప్రభావితం చేసేలా అన్ని పార్టీలు దృష్టి సారించాయి. ఈ క్రమంలో కొన్ని రోజులుగా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ తదితర ఇంటర్నెట్ మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం సాగింది. వివిధ పార్టీలు, ఆయా అభ్యర్థులు ప్రైవేట్ పాటల ఆల్బమ్‌లను రూపొందించి వాటిని సోషల్ మీడియా ప్రచార అస్త్రాలుగా మార్చుకున్నారు. భౌతికంగా నిర్వహించే ప్రచార కార్యక్రమాలను సోషల్ మీడియాలో ప్రసారం చేశారు. ఎలాగైనా సరే సోషల్ మీడియాలో వైరల్‌గా మారాలి, ఓటర్లను ఆకర్షించాలనే నినాదం ప్రచారాన్ని జోరెక్కించారు. సోషల్ మీడియా ప్రచారం కోసం కొన్ని పార్టీలు ప్రత్యేకంగా టెక్నికల్ టీంను సైతం నియమించుకోవడం విశేషం. ఇదే అదనుగా కొంత మంది అవాస్తవాలను, దుష్ప్రచారాలకు తెరలేపారు. వ్యూస్ కోసం, వైరల్ మారడం కోసం అనవసరమైన సమాచారాన్ని ప్రచారం చేసిన ఘటనలూ లేకపోలేదు. ఏదేమైనా పోలింగ్ ముగియడంతో సోషల్ మీడియాలో పోస్టులు తగ్గిపోయాయి. అక్కడక్కడా ఆయా పార్టీల శ్రేణులు లెక్కలు, అంచనాలతో పోస్టులు పెడుతూ కాలక్షేపం చేస్తున్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో 'మేరీ'సింది

- అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటిన పేదింటి బిడ్డ
- రెండు బంగారు పతకాలు సాధించిన పాలిటెక్నిక్ విద్యార్థిని



పోటీలో స్కిప్పింగ్ చేస్తున్న మేరీ



బంగారు పతకాలతో మేరీ



మేరీ సాధించిన పతకాలు



మేరీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు, అధ్యాపకులు

మురళీనగర్: నగరానికి చెందిన ఓ పేదింటి బిడ్డ అంతర్జాతీయ స్థాయిలో రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌గా నిలిచి విశాఖ కీర్తి పతాకను ఎగురవేసింది. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మెటలర్జికల్ విభాగంలో సాంకేతిక విద్యనభ్యసిస్తున్న ఎస్.మేరీ సౌత్ ఏసియన్ రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్‌లో దేశం తరఫున హాజరై ప్రతిభ చూపింది. ఈ పోటీల్లో రెండు బంగారు పతకాలను సాధించి సత్తా చాటింది. ఆడపిల్లలు సరదాగా ఆడుకునే రోప్ స్కిప్పింగ్‌నే తన క్రీడగా ఎంచుకుని ప్రపంచ స్థాయి గుర్తింపు పొందింది. ఆమె తండ్రి రామస్వామి డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి రేణుక గృహిణి.

అసాధారణ ప్రతిభ

మేరీ సరదాగా నేర్చుకున్న రోప్ స్కిప్పింగ్‌లో వేగాన్ని గమనించిన పాలిటెక్నిక్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అబ్బాస్‌బేగ్‌తో పాటు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, మెటర్జికల్ హెడ్ రత్నకుమార్, ఇతర విభాగాధిపతులు ఆమెను ప్రోత్సహించారు. నేపాల్‌లోని ఖాట్మండులో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన సౌత్ ఏసియన్ రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్‌లో ఆమె పాల్గొంది. 17 ఏళ్లు దాటిన విభాగంలో మూడు నిమిషాల ఎన్డ్యూరెన్స్ మహిళ విభాగంలో 382 స్కోరు చేసి గోల్డ్ మెడల్ సాధించింది. 30 సెకండ్ల డబుల్ అండర్ మహిళా విభాగంలో 82 స్కోర్ చేసి మరో బంగారు పతకాన్ని సాధించి దేశ కీర్తి ప్రతిష్ఠలు పెంచింది. దక్షిణాసియా నుంచి ఏడు దేశాలు పాల్గొన్న ఈ పోటీల్లో ఎస్.మేరీ భారత్ తరఫున ప్రాతినిథ్యం వహించింది. మేరీ రెండు విభాగాల్లోనూ ప్రథమ స్థానం సాధించగా.. బంగ్లాదేశ్‌కు చెందిన మహిళ ద్వితీయ స్థానం, పాకిస్తాన్‌కు చెందిన మహిళ తృతీయ స్థానంలో నిలిచారు. కాగా.. ఏప్రిల్ 13, 14 తేదీల్లో ఢిల్లీలోని తాల్కటోర స్టేడియంలో జరిగిన జాతీయస్థాయిలో రోప్ స్కిప్పింగ్ పోటీల్లోనూ మేరీ సత్తా చాటింది. 3 నిమిషాల ఎన్డ్యూరెన్స్ విభాగంలో 384 స్కోర్, 30 సెకండ్ల డబుల్ అండర్ విభాగంలో 82 స్కోర్ చేసి బంగారు పతకాలు సాధించింది.

అభినందనల వెల్లువ

బంగారు పతకాలు సాధించిన మేరీకి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పాలిటెక్నిక్ కళాశాలకు బుధవారం వచ్చిన సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. మెటలర్జికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి రత్నకుమార్, పీడీ అబ్బాస్ బేగ్, ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు ఆమెను ఘనంగా సత్కరించారు. కళాశాలకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకొచ్చిన మేరీకి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని ప్రిన్సిపాల్ నారాయణరావు, మెటలర్జికల్ విభాగాధిపతి రత్నకుమార్ చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్, మెటలర్జికల్ విభాగాధిపతి, పీడీ, ఇతర విభాగాల అధిపతులు, తల్లిదండ్రుల సహకారంతో ఈ ఘనత సాధించగలిగానని మేరీ తెలిపారు.